క్లుప్తంగా

నేడు హనుమాన్ చాలీసా పోటీలు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీ శారద సంగీతాలయం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీహనుమాన్ చాలీసా పోటీలను నిర్వహించనున్నారు. నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధన స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని వివరించారు. ఆసక్తి గలవారు సంగీత ఉపాధ్యాయులు గౌరావర్ముల ఆంజనేయ శాస్త్రిని 99890 35470 నంబరులో సంప్రదించాలని కోరారు.

కాపు జాగృతి జిల్లా అధ్యక్షురాలిగా రజని



తెనాలిఅర్బన్: అఖిల భారత కాపు జాగృతి గుంటూరు జిల్లా అధ్యక్షురాలిగా తెనాలికి చెందిన కమ్మెల రజని నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందు జనార్ధన్, రంగిశెట్టి మంగబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మాట్లాడుతూ కాపు సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికలలో జనాభా ప్రాతిపదికన కాపులకు ఎమ్మెల్యే సీట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తన నియామకానికి కృషి చేసిన అధ్యక్ష, కార్యదర్శులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

ఇస్రో శాస్త్రవేత్త లక్ష్మీ ప్రియాంక



తెనాలిఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఇస్రో సైంటిస్ట్ లక్ష్మీ ప్రియాంక పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన వారి అభినందన సభను రైల్వే స్టేషన్‌రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యం ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువితే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యోగాలు సాధించటం అభినందనీయమన్నారు. తమ కళాశాల విద్యార్థులు హెచ్‌సీఎల్ కంపెనీ వారు నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో అయిదుగురు ఉద్యోగాలు సాధించారని చెప్పారు. అనంతరం వారిని అభినందించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ ఎస్‌ఐ ఎం. విజయ్‌కుమార్ తమ సిబ్బందితో శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.200లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనపరుచుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దైవజనులు ఐక్యంగా ఉండాలి

తెనాలిటౌన్: దైవజనులు ఐక్యంగా ప్రార్థన చేయటం ద్వారా లబ్ధి చేకూరుతుందని పాల్ అండ్ లూక్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బ్రదర్ ఆనందన్న తెలిపారు. ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనాకొండ చర్చిలో శనివారం దైవజనుల ఐక్య సహవాస ప్రార్థనా కూడికను నిర్వహించారు. సమావేశంలో దైవజనుని గొప్పతనం అనే అంశంపై పలువురు దైవజనులు ప్రసంగించారు. ప్రపంచ శాంతి, దేశ రక్షణ కోసం ప్రార్థనలు చేశారు. బ్రదర్ ఆనందన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ పి.శామ్యూల్, రెవరెండ్ కె.యోనా, ఎం.స్టీఫెన్, పాస్టర్ షాలేము, పాస్టర్ రత్నరాజు, పాస్టర్ ఐజక్ కుమార్‌లు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగు పరిశీలన



కొల్లిపర: కొల్లిపర మండలంలోని చివలూరు, దావులూరు, తూములూరు గ్రామాల్లో సాగులో ఉన్న జొన్న, మొక్కజొన్న పంటలను శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఏరువాక కేంద్రం కీటక విభాగం ప్రధాన శాస్త్రవేత్త నగేష్‌బాబు మాట్లాడుతూ మొక్కజొన్న పైరులో గులాబీ రంగు పురుగును గుర్తించినట్లు తెలిపారు. నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ రామాంజనేయులు, ఏడీఏ ఎస్.ఉషారాణి, ఎంపీఈవోలు, ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు

- పోటీల్లో హోరాహోరీగా తలపడిన క్రీడాకారులు
- విజేతలకు బహుమతులు అందజేత



పోటీల్లో గెలుపొందిన విజేతలతో అధికారులు

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల విజేతలకు ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సూరపనేని కల్పన, పి.శ్రీనివాసరావులు బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీలకు అంపైర్‌లుగా ఎస్.వినయ్‌కుమార్, కె.మోజెస్‌లు వ్యవహరించగా బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీకాంత్, రాంబాబులు వ్యవహరించారు. ఫిజికల్ డైరెక్టర్‌లు బేగమ్, శైలజ, శివశంకర్‌లు పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

మండల స్థాయిలో క్రికెట్ పురుషుల విభాగంలో విన్నర్‌గా కఠెవరం టీమ్ నిలువగా, రన్నర్‌గా పెదరావూరు టీమ్ నిలిచింది. ఉమెన్స్ విభాగంలో విన్నర్‌గా పెదరావూరు-2 టీమ్, రన్నర్‌గా అంగలకుదురు-2 టీమ్‌లు నిలిచాయి. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో విన్నర్‌గా కొలకలూరు-2 టీమ్ నిలువగా, రన్నర్‌గా జగ్గడిగుంటపాలెం టీమ్ నిలిచింది. మహిళల విభాగంలో విన్నర్‌గా కొలకలూరు-2 టీమ్, రన్నర్‌గా కఠెవరం టీమ్‌లు నిలిచాయి. కబడ్డీలో పురుషుల విభాగంలో విన్నర్‌గా కొలకలూరు-2 టీమ్ నిలువగా విన్నర్‌గా అంగలకుదురు-2 టీమ్ నిలిచింది. మహిళల విభాగంలో విన్నర్‌గా పెదరావూరు-1 టీమ్, రన్నర్‌గా కొలకలూరు-1 టీమ్‌లు నిలిచాయి. వాలీబాల్‌లో పురుషుల విభాగంలో విన్నర్‌గా కఠెవరం-1 టీమ్, రన్నర్‌గా కొలకలూరు-2టీమ్ లు నిలిచాయి. మహిళల విభాగంలో విన్నర్‌గా పెదరావూరు-1టీమ్, రన్నర్‌గా అంగలకుదురు -1టీమ్‌లు నిలిచాయి. ఖోఖోలో పురుషుల విభాగంలో విన్నర్‌గా పెదరావూరు-2 టీమ్, రన్నర్‌గా అంగలకుదురు-2 టీమ్‌లు నిలిచాయి. మహిళల విభాగంలో విన్నర్‌గా పెదరావూరు-1 టీమ్, రన్నర్‌గా అంగలకుదురు-2 టీమ్ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉంటాయని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, వాటి నివారణ, చట్టపరంగా తీసుకునే చర్యలు వంటి వాటిపై అవగాహన కలిగించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో సురక్షితమైన పని వాతావరణం ఉండాలని, దురుద్దేశంతో తాకటం, శారీరక, మానసిక వేధింపులకు గురి చేయడం, లైంగిక కోరికలు వ్యక్త పరచడం, లైంగిక పదాలను ఉపయోగించడం, అశ్లీల చిత్రాలు చూపడం వంటివి లైంగిక వేధింపుల కిందకు వస్తాయని తెలిపారు. వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. మైనర్లపై జరిగే లైంగిక వేధింపులను నివారించేందుకు పోక్సో చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారని వివరించారు. ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, పీఈటీ రవికుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్ కుమార్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్



మాట్లాడుతున్న అజయ్ కుమార్

తెనాలిఅర్బన్: సీపీఐ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే విధంగా అంతా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటుందని విమర్శించారు. ప్రజలంతా ఇలాంటి మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని కోరారు. పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు మాట్లాడుతూ సీపీఐ అనేక ప్రజా ఉద్యమాలు చేస్తూ నిత్యం ప్రజల శ్రేయస్సుకు పాటుపడుతుందని చెప్పారు. సమావేశంలో తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, నాయకులు కనపర్తి బెనహర్, బొల్లిముంత కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, నాయకులు పర్చూరి వెంకటేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టీసీఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ టీసీఎస్‌కు 144 మంది ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా టీసీఎస్ నిర్వహించిన నేషనల్ క్వాలిఫైర్ టెస్ట్‌లో నెగ్గి, తదుపరి ఇంటర్వ్యూలో ప్రతిభను చాటి ఉద్యోగాలను సాధించుకున్నట్లు ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శనివారం విలేకరుల సమావేశంలో చెప్పారు. కంపెనీల అవసరాలు, ఉపాధి అవకాశాలను అధ్యయనం చేస్తూ, అందుకు తగిన శిక్షణను ఇస్తున్నందునే విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలను అందుకుంటున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు తగ్గిన పరిస్థితుల్లోనూ తమ విద్యార్థులు 144 మంది టీసీఎస్‌లో ఉద్యోగాలను సాధించటం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు మండలాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో జి.విజయలక్ష్మి శనివారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే మహిళ ఆ గ్రామంలో నివాసం కలిగి ఉండాలని చెప్పారు. 2023 డిసెంబర్ 31వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భట్టిప్రోలు మండలం పెదలంక (ఎస్సీ)లో కార్యకర్త పోస్టుకు, భట్టిప్రోలులో (బీసీ-బీ) ఆయా పోస్టుకు, కోళ్లపాలెంలో(ఎస్సీ) ఆయా పోస్టుకు, చుండూరు మండలం వలివేరు (బీసీ-ఎ)లో కార్యకర్త, అంబేడ్కర్ నగర్ (ఎస్సీ)లో ఆయా పోస్టుకు, అమృతలూరు మండలం తురుమెళ్ల (బీసీ-ఎ)లో కార్యకర్త, తురుమెళ్ల (ఓసీ)లో ఆయా పోస్టుకు దరఖాస్తులు పెట్టుకోవాలని కోరారు. దరఖాస్తులు ఈ నెల 27వ తేదీ లోగా అమృతలూరు సీడీపీవో కార్యాలయంలో అందించాలని కోరారు.

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

కర్లపాలెం: మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, కర్లపాలెం గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి అన్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంపీ రాజుపాలెం ఉన్నత పాఠశాలలో శనివారం విజయం మహిళా గ్రామ సంఘం సమావేశం జరిగింది. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత నగదు ఈనెల 23వ తేదీన సీఎం జగన్ విడుదల చేయనున్న సందర్భంగా డ్వాక్రా మహిళలు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, సర్పంచ్ నక్కా లలితకుమారితో కలసి సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. పాత ఇస్లాంపేటలో సైతం డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఏపీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 1079 డ్వాక్రా సంఘాలకు ఇప్పటి వరకు ఆసరా నగదు మూడు విడతల్లో రూ.29.46కోట్లు విడుదల అయ్యాయని చెప్పారు. నాల్గవ విడతలో రూ.9.81కోట్లు ఈ నెల 23న విడుదల కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, పార్టీ నాయకులు పేరాల వెంకట సురేష్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, సీసీ పూర్ణ చంద్రరావు, డ్వాక్రా మహిళలు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు



తెనాలిటౌన్: తెనాలిలోని జేఎంజే మహిళా కళాశాలలో ప్రారంభమైన దక్షిణ భారత సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2023 పోటీలు శనివారం రెండో రోజు జరిగాయి. 53 కిలోలు, 59 కిలోలు,74 కిలోల విభాగంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ సూర్యనారాయణ, సౌత్‌జోన్ సెక్రటరీ కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, హెచ్‌సీవీ అధినేత కరణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



తెనాలిటౌన్: పట్టణంలోని 12వ వార్డు చినరావూరు స్టేషన్‌రోడ్డులో గల ఆర్ఎన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో శనివారం 25 మంది పారిశుద్ధ్య కార్మికులకు రెవరెండ్.పల్లె శామ్యూల్ దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యం కోసం వీధులను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తూ సేవ లందిస్తున్నారని అన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

25 నుంచి శ్రీరామ నామ కోటి ఉత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి రామ నామ క్షేత్రంలో ఈ నెల 25 నుంచి 28 వరకు 73వ శ్రీరామ నామకోటి మహోత్సవములు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షులు కొన్నిపాటి భాస్కరరావు, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక పూజలు, శ్రీ సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, నాలుగు రోజుల పాటు భగవద్గీత పారాయణం , హరి కథలు, ఉపన్యాసములు, సంకీర్తనలు జరుగుతాయని పేర్కొన్నారు.

రాములవారి అక్షింతలు పంపిణీ

బాపట్ల అర్బన్: అయోధ్య రామ మందిరంలో ఈ నెల 22న రాములవారి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా బాపట్ల పట్టణ పుర వీధుల్లో శనివారం శ్రీరామ నామ సంకీర్తనతో శోభాయాత్ర నిర్వహించారు. అక్షింతలు, రాముల వారి ప్రతిమతో కూడిన స్టిక్కర్లను అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భావపురి పురోహితుల సంఘం సభ్యులు గూడా బట్టు, శ్రీకాంత్, మోహన్, బాబు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల అర్బన్: జిల్లా సమగ్ర శిక్షణా కార్యాలయంలో అసిస్టెంట్ ఐడీ కోఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఉర్దూ) పోస్టులకు గానూ జిల్లా పరిధిలోని జెడ్పీ పాఠశాలల నుంచి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్హులైన వారు ఈ నెల 27న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు విడివిడిగా అందించాలని చెప్పారు. ఇతర వివరాలకు డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

22న దేవాలయాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

భట్టిప్రోలు: అయోధ్య బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకుని అన్ని దేవాలయాలలో ఈ నెల 22న రామనామ సంకీర్తన, హనుమాన్ ఛాలీసా పారాయణ, భజన సంకీర్తనలు నిర్వహించుకోవాలని బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావులు శనివారం కోరారు.

గరుడవాహనంపై ఊరేగిన సాయినాథుడు



ఉత్సవ మూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తెనాలి: పట్టణానికి చెందిన సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రం 32వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా ఆరంభించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని టీజీకే కల్యాణ మండపంలో రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకలు గరుడ వాహనంతో సాయంత్రం ప్రారంభమైంది. బోసురోడ్డులోని సత్సంగ కేంద్రం నుంచి గరుడవాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి, తెనాలి పురవీధుల్లో కలియతిప్పారు. రాత్రి తొమ్మిది గంటలకు టీజీకే కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన 'పుష్పధామం'లో విడిది చేశారు. అనంతరం ఉత్సవ సత్సంగ మూర్తులకు హారతి, ప్రసాద అర్పణం అనంతరం బాబా, గురుదేవులకు పుష్పధామంలో విశ్రాంతి కల్పించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు బాబా భజనతో కార్యక్రమాలు ఆరంభిస్తామని చెప్పారు. సామూహిక సాయి సచ్చరిత్ర పారాయణ, శ్రీ శిరిడీ సాయిబాబా కథా నృత్య గీతిక, పుష్పధామంలో మధ్యాహ్న హారతి, శ్రీసాయి తత్వంపై బ్రహ్మశ్రీ నోరి కోదండరామ్‌చే ప్రవచనం, సంకీర్తనామృతం, మధ్యాహ్నం సాయినాథుని భోజనశాలలో అన్నసంతర్పణ జరుగుతుందని వివరించారు. గరుడవాహన నగరాయణంలో కన్వీనర్ వీఎస్ నాగభూషణరెడ్డి, దత్తు, టీజీ కృష్ణ, శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయమూర్తి బి రూపశ్రీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి రూపశ్రీ

నగరం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రేపల్లె కోర్టు జడ్జి బి రూపశ్రీ సూచించారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శనివారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో రూపశ్రీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు.చట్టాలపై అవగాహన లేకపోతే ముందు ఇబ్బందులు ఎదురువుతాయని అన్నారు. పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. మరో న్యాయమూర్తి ఎల్ జగదీష్ కుమార్ న్యాయ వ్యవస్థ గురించి విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులకు న్యాయ వ్యవస్థపై అవగాహన లేకపోతే నేరాలలో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ డి రామకృష్ణ, ప్రిన్సిపాల్ హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలలో కానుకల హుండీలు లెక్కింపు



బండ్లమ్మ దేవాలయంలో కానుకల హుండీ లెక్కిస్తున్న అధికారులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామ పరిధిలో గల దేవాలయాలలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను శనివారం లెక్కించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ చందోలు శ్రీ లింగోద్భవస్వామి దేవాలయంలో కానుకల హుండీ లెక్కించగా రూ.29,501లు, శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో కానుకల హుండీ లెక్కింపులో రూ.8,525లు, చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో కానుకల హుండీ లెక్కింపులో రూ.3.90 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్యామల,హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ పి.రాజేష్, సతీష్, చందోలు పోలీసు సిబ్బంది త్రిశూల్‌పాణి, బండ్లమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, ఆలయ పూజారులు దండిబొట్ల శ్రీనివాసు, వేదాంతం వరదాచార్యులు, కుంచల నరసారెడ్డి, భవనంవారిపాలెం కోదండరామ మహిళాభక్త సమాజం మహిళలు పాల్గొన్నారు.

పీతల సాగులో మెలకువలపై అవగాహన



రైతులకు సూచనలిస్తున్న రామకోటేశ్వరమ్మ

నిజాంపట్నం: లాభదాయకమైన సాగు పీతల సాగని, పీతల సాగులో అధికారుల సూచనలు పాటించి ఆక్వా రైతులు అధిక దిగుబడులు సాధించాలని గ్రామ మత్స్యశాఖ సహాయకులు టి.రామకోటేశ్వరమ్మ తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నం-1 సచివాలయ పరిధిలోని కొల్లాటి దానమూర్తి ఆక్వా చెరువు వద్ద ఆక్వా రైతులకు శనివారం నిర్వహించిన 6వ విడత ఆక్వా సాగుబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పీతల పెంపకం రొయ్యలు, చేపల సాగుతో పోలిస్తే ఒత్తిడి లేని లాభదాయకమైన ఆక్వా సాగని రైతులకు సూచించారు. తక్కువ పెట్టుబడితో, తక్కువ శ్రమతో చేసుకోగల లాభదాయకమైన సాగు పీతల సాగన్నారు. పీతలు సాగు చేసే విధానాన్ని, ఆక్వా రైతులు పొందే కేసీసీ రుణాలు, ఏపీఎస్ఏడీఏ లైసెన్స్‌లు, ఎంఎఫ్‌పీ యూనిట్లు, మత్స్యశాఖ కార్యకలాపాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్ఏ టి.రామకోటేశ్వరమ్మ, వీఎఫ్ఏ సీహెచ్ బ్రహ్మం, ఆక్వా రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి



విగ్రహాల ఏర్పాటుకు శంఖుస్థాపన చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి, డాక్టర్ ఈవూరి

రేపల్లె రూరల్: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఓల్డ్‌టౌన్ రహదారి విస్తరణలో తొలగింపుకు గురైన మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలతో పాటు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాల ఏర్పాటుకు శనివారం రాత్రి ఓల్డ్‌టౌన్‌లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి ఆయన శంఖుస్థాపనలు చేశారు. సమాజ అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమన్నారు. భవిష్యత్‌లోనూ పట్టణ ఆర్యవైశ్యులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్త, కమిషనర్ విజయసారథి, ఆర్యవైశ్య నాయకులు మద్ది బదిరి నారాయణమూర్తి, బొలిశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహనకు సంకల్పయాత్ర

వేటపాలెం(వేమూరు): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుగుణమ్మ అన్నారు. చుండూరు మండలంలోని వేటపాలెం, పెనురుద్ర పాడు గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందా జనార్ధన్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో వికసిత భారత్ సంకల్ప యాత్ర ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేమూరు నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో యాత్ర నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తోట నాగ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.